తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



సీనియర్ సిటిజన్స్ కోర్టు కేసును విచారిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్

మదనపల్లె : వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి బిడ్డలదేనని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్ కోర్టు కేసును విచారించారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ అండేవారిపల్లెకు చెందిన అండేకృష్ణమూర్తి (85) తన కుమారుడు అండే వెంకట నాగేశ్వరం నుంచి పోషణ నిమిత్తం ప్రతినెలా రూ.10,000 మెయింటెన్స్ ఇప్పించాలని వేసిన కేసులో తండ్రి, కుమారుడిని విచారించారు. కుటుంబ విలువలతో భారతీయ సంస్కృతి ఏర్పడిందని, తల్లిదండ్రుల రక్షణ కోసం ప్రత్యేకంగా చట్టం తీసుకువచ్చే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. తల్లిదండ్రుల కనీస అవసరాలను పిల్లలు తీర్చాలని, లేనిపక్షంలో చట్టప్రకారం నేరమవుతుందని అన్నారు. ప్రతినెలా 10వతేదీ లోపు అండే కృష్ణమూర్తికి సంరక్షణ, పోషణ ఖర్చుల నిమిత్తం రూ.9,000 ఆయన ఖాతాలో జమచేయాల్సిందిగా కుమారుడు అండే వెంకటనాగేశ్వరంను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ మాట్లాడుతూ... వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్న వారి సంరక్షణ కోసం సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం-2007 అమలులో ఉందన్నారు. వృద్ధాప్యంలో కనీస ఆదాయం లేని తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి పోషణ ఖర్చుల కోసం ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని చట్టం చెబుతోందన్నారు. పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు ఈ చట్టాన్ని ఉపయోగించుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి సూచించారు.

స్పందన సమస్యలపై సత్వర పరిష్కారం

మదనపల్లె : స్పందన కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలకు సత్వరమే పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా... మదనపల్లె వైఎస్సార్ కాలనీలో ఎండీయూ వాహనం లేకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదని స్థానికులు ఆర్డీఓకు ఫిర్యాదుచేశారు. కాలనీలో అందరూ కూలినాలీ చేసుకునే వారు కావడంతో రేషన్ సరుకులకు ఒకరోజు పూర్తిగా కేటాయించాల్సి వస్తోందన్నారు. కాలనీలో రేషన్‌షాపు కేటాయించి ఎండీయూ వాహనాన్ని ఏర్పాటుచేసి ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని కోరారు. అమ్మచెరువుమిట్టలో సర్వేనెం.556/2లో 0.02 సెంట్ల జాగాలో తాను నిర్మించిన ఇంటిలో హైవే రోడ్డుకు కొంతభాగం తీసుకుని పరిహారం రూ.33,71,203 చెల్లించారని, నష్టపరిహారం తనకు సరిపోదని, పెంచి ఇవ్వాల్సిందిగా నాగరాజు ఫిర్యాదుచేశాడు. దాయాదుల మధ్య భూమికి సంబంధించి విభేదాలు జరుగుతున్న నేపథ్యంతో సర్వే చేసి సమస్యను పరిష్కరించాల్సిందిగా నీరుగట్టుపల్లెకు చెందిన మోడెం వెంకటేష్ అర్జీ సమర్పించారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో గంగారపులేఅవుట్ సుభాష్‌రోడ్డు ఎక్స్‌టెన్షన్‌లో ఇంటిముందు మురుగుకాలువను శుభ్రపరచి మరమ్మతు చేయాల్సిందిగా జే.మురళీధరవర్మ అర్జీ సమర్పించారు. ఆర్టీఐ కింద కోరిన సమాచారం ఇవ్వడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కనపరుస్తున్నారని వెంకటేశ్వరప్రసాద్ ఫిర్యాదుచేశారు.

కూలీలందరికి జాబ్‌కార్డులు ఇవ్వాలని వినతి

నిమ్మనపల్లె: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీలందరికి వంద శాతం జాబ్ కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శోభ ఎంపీడీఓ లీలామాధవికి విన్నవించారు. కూలీలతో కలిసి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. కూలీలు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కుటుంబానికి ఒక్కటే జాబ్‌కార్డు ఇస్తున్నారని, ఈ విధానాన్ని మార్చి పనులు చేసే కూలీలకు ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన వెంటనే పని కల్పించాలన్నారు. ఉపాధికూలీ వేతనాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ ఊరేగింపు

పీలేరు రూరల్ : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంతుని ఊరేగింపుఘనంగా నిర్వహించారు. స్థానిక సదుం మార్గంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఉత్సవ విగ్రహాన్ని పుష్పాలతో విశేషాలంకరణ చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని పట్టణంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

18న ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని మదనపల్లె 2 డిపో నుంచి ఈనెల 18న ఊటీకి ప్రత్యేక స్పెషల్ బస్సు నడపనున్నట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 18న రాత్రి 8 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 19న ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. 20న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి కూనూరు, మెట్టుపాలెం మీదుగా కోయంబత్తూరు ఈశా టెంపుల్ చూసుకుని అదే రోజు రాత్రి బయలుదేరి 21న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు.

20న వేలాంగిణికి ప్రత్యేక బస్సు

వేసవి పురస్కరించుకుని వేలాంగిణికి 20న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డీఎం తెలిపారు. 20న రాత్రి మదనపల్లెలో బయలుదేరి 21న తెల్లవారుజామున వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి అదే రోజు రాత్రి బయలుదేరి 22న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.1950 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

భాగ్యలక్ష్మికి సన్మానం



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న సీనియర సిటిజన్స్

మదనపల్లె సిటీ: విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ రాష్ట్ర సలహా మండలి ప్రతినిధిగా ఎంపికైన భాగ్యలక్ష్మిని సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, మునిరత్నం, జగన్‌మోహన్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పాలసేకరణ కేంద్రాల ఏజెంట్‌లకు శిక్షణ

పెద్దమండ్యం: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా పాలసేకరణ కేంద్రాల ఏజెంట్‌లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. పాలసేకరణలో ఏజెంట్‌లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అమూల్ జిల్లా కో ఆర్డినేటర్ నవీన్ వివరించారు. దళారి వ్యవస్థ లేకుండా చేసేందుకు అమూల్ ద్వారా గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. జిల్లాలో 3600 మంది రైతుల నుండి 42 వెల లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీవో శ్రీధర్‌రావు, వెటర్నరీ డాక్టర్‌లు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతికి నివాళి



అలివేలమ్మ (ఫైల్)

మదనపల్లె: పలమనేరు హౌసింగ్ డీఈఈ రమేష్‌రెడ్డి తల్లి కంభం అలివేలమ్మ అనారోగ్య కారణాలతో, మదనపల్లె పట్టణం క్రిష్ణానగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, చిత్తూరు జిల్లా హౌసింగ్ పీడీ పద్మానాభం, పలమనేరు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. డీఈఈ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం ఉదయం 10 గంటలకు వాల్మీకిపురం మండలం అయ్యావారిపల్లె గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించినట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. మండలంలోని దేవప్పకోట పంచాయతీకి లావణ్య, పులికల్లు పంచాయతీకి మంజులను నియమిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు అందజేసామని ఎంపీడీఓ తెలిపారు.

గౌరమ్మతల్లికి ప్రత్యేక పూజలు



తంబళ్లపల్లె: గౌరమ్మగుట్టలో వెలసిన గౌరమ్మతల్లి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను పూజారి శేఖర్ అందజేశారు. భక్తులు సంతానం, పెళ్లిలు జరగాలని మొక్కుకున్నారు. ప్రధాన ఆలయంలో పూజారులు మల్లికార్జున, ఈశ్వరప్పలు స్వామికి అభిషేకాలు, పూజలతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయకమిటీ చైర్మన్ మల్లిరెడ్డి, ఈడ రమణల ఆధ్వర్యంలో దేవస్థాన తరపున భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు పుస్తకాలు, యూనిఫారం, షూ, భోజనం, అమ్మ ఒడి, ట్యాబ్‌లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలికలకు రక్షణ, భద్రత కలిగిన ప్రభుత్వ బాలికల పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. తమ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వర కే కాకుండా ఇంటర్మీడియట్ కూడా ఉందని, ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పాఠశాలలో 574 మార్కులతో విద్యార్థిని మేఘన మండల టాపర్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, వసుంధర, అనురాధ, విజయలక్ష్మి, వేదవాణి, ఎంపీటీసీ రాజేష్, కమిటీ చైర్‌పర్సన్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా కనెక్షన్ ఇవ్వకుంటే పరిహారం



గాలిబండపై పర్యటిస్తున్న చైర్మన్ నాగార్జునరెడ్డి

బి.కొత్తకోట : ఏ కేటగిరికి చెందిన విద్యుత్ కనెక్షన్ అయినా గడువులోగా ఇవ్వకుంటే డిస్కం ద్వారా దరఖాస్తుదారులకు పరిహారం చెల్లించేలా విప్లవాత్మక మార్పును తీసుకొచ్చామని జస్టిస్ సీవీ.నాగార్జునరెడ్డి తెలిపారు. అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు ఆయన సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనెక్షన్ ఇవ్వడానికి నిర్దేశిత గడువు ఉంటుంది, ఈ గడువులోపు కనెక్షన్ ఇవ్వకుంటే దరఖాస్తుదారుడికి నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ నష్టంపై దరఖాస్తు గడువు ముగిసిన మరుసటి రోజు నుంచి కనెక్షన్ ఇచ్చేరోజు వరకు పరిహారం చెల్లిస్తామన్నారు. దీనివల్ల డిస్కం అధికారులు, ఉద్యోగుల్లో జవాబుదారితనం పెరిగిందని, ఈ విషయమై వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

వాతావరణం, పచ్చదనం బాగుంది

హార్సిలీహిల్స్‌పై నాగార్జునరెడ్డి కుటుంబీకులతో కలిసి కొండపై ప్రకృతి అందాలను తిలకించారు. అటవీసముదాయం, గాలిబండ, వ్యూపాయింట్లు, ప్రకృతి అధ్యయన కేంద్రం, ముసల్లపార్కు, బ్రిటీష్‌పాలనలో నిర్మించిన అతిథిగృహం, 164 ఏళ్ల మహా నీలగిరి వృక్షం తిలకించారు. అటవీ అతిథిగృహం నిర్మాణానికి లండన్ నుంచి దిగుమతి చేసుకున్న పెంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలిబండపై వ్యూపాయింట్, సందర్శకులకు రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. కొండపై చల్లటివాతావరణం, పచ్చదనం ఆహ్లాదపరుస్తోందన్నారు. సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు పెరగాలన్నారు.ప్లాస్టిక్ వినియోగం నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనకు డిస్కం ఎస్ఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ ధనుంజయలు, టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి, డిస్కం ఈఈ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓ ఖాదర్‌బాషా, రామలింగారెడ్డి స్వాగతం పలికారు.

వైభవంగా గర్నిమిట్ట ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ అమ్మవారు



ప్రత్యేక ఆకర్షణగా చాందినీబండి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన ఎల్లమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ఆమ్మ వారికి మొక్కులు చెల్లించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా భక్తులు బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలం నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చాందినీబండ్లు కట్టి మొక్కుబడులు చెల్లించారు. చాందినీ బండ్లు ముందు బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. సోమవారం ఉదయం చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లకు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ప్రతి చాందినీ బండి ముందు పెద్ద ఎత్తున బాణా సంచా పేలుళ్లు మార్మోగాయి.

జాతరలో భాగంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయం ముందు పెద్ద ఎత్తును కొబ్బరి కాయలు కొట్టి సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు అభివృద్ధి చెందేలా ప్రజలను చల్లగా చూడాలని వేడుకొన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటీపీ షేర్ చేయడం లాంటి వాటిపట్ల అప్రమత్తత అవసరం అన్నారు. వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రోడ్డుప్రమాదాల నుంచి బయటపడవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ నేపథ్యంలో ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలలో చిన్నచిన్న విషయాలకు గొడవలకు దిగకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పేకాట, బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జీవీ ఫుట్ బాల్ పేరుతో కొంతమంది సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్నారని ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్టు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లిలో

వీరబల్లి(రాజంపేట) : జీవీఫుట్‌బాల్ ఆన్‌లైన్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రహీముల్లా ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నంబర్ల నుంచి ఎవరైనా ఫోన్ చేసి మీకు రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ చూపిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ వాహనాలను పిల్లలకు ఇచ్చి పంపరాదన్నారు. వాహనాదారులు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

అనుమతులు లేని యాప్‌లపై జాగ్రత్త

నంబేపల్లె : అనుమతులు లేని యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షరీఫ్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి యాప్‌లనైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా జీవీ ఫుట్‌బాల్ యాప్‌తో ప్రజలు మోసపోవద్దని తెలిపారు. అనుమతులు లేని యాప్‌లు, నగదు సంబంధిత యాప్‌లను లింక్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకుంటే ఆన్‌లైన్ మోసాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మోసపోయిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పెద్దమండ్యం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని తహసీల్దార్ ఆదుకోవాలని గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వివరాలలోకి వెళితే... పెద్దమండ్యం - గుర్రంకొండ రహదారిపై మండలంలోని శిద్దవరం గ్రామం కోటగుట్టపల్లె బస్టాప్ వద్ద శుక్రవారం తహసీల్దార్ నిర్మలాదేవి ప్రయాణిస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొని ఒకరు మృతిచెందగా, రెక్కలకొండపల్లెకు చెందిన ఆర్. వెంకట్రమణ తీవ్రంగా గాపడిన విషయం తెలిసిందే. సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తీవ్రంగా గాయపడి తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని తహసీల్దార్ కనీసం పరామర్శించలేదని గ్రామస్థులు కార్యాలయం వద్ద బైఠాయించారు. తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్థులతో తహసీల్దార్ మాట్లాడించారు. బాధితుడికి చికిత్సలు చేయిస్తానని తహసీల్దార్ చెప్పడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథ, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, గుర్రం రామచంద్ర, తిరుపాల్‌నాయక్, రెడ్డెప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో భూసారం పెంపు

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయ సాగులో చేసే పంటలతో భూసారం పెరుగుతుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రాజేష్, వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని జర్రావారిపల్లి, అయ్యావారిపల్లిలో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ సాగును మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 30 మంది మహిళా రైతుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళా బృందం సభ్యులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రకృతి సాగులో 30 రకాల అంతర్ పంటల సాగు వలన నిత్యం నాణ్యమైన దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొంద వచ్చునని సూచించారు. భూమిపైన జీవ వైవిధ్యం, భూమి లోపల రకరకాల వేరు వ్యవస్థ ద్వారా అనేక రకాల సూక్ష్మజీవులు ఉత్పన్నమవుతాయని, తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు సంవృద్ధిగా అందుతాయని వివరించారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

పీలేరు : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫారెస్ట్ అధికారులతో కలసి పర్యావరణ పరిరక్షణపై అగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు.

మల్లయ్యకొండపై భక్తిశ్రద్ధలతో భజనలు

కురబలకోట: మండలంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న అంగళ్లు మల్లయ్య కొండ భజన బృందాలతో సోమవారం మారుమోగింది. భక్తి భావం ఉప్పొంగింది. భగవంతుని కీర్తించడంలో భజన కూడా ఒకటి. ములకలచెరువు మండలం బీగంవారిపల్లె గ్రామస్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు భజనలు చేశారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలోని ఆధార్‌కార్డు దారులు అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో ఆనంద్‌కుమార్ సూచించారు. సోమవారం తంబళ్లపల్లె సచివాలయంలోని ఆధార్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్ జరుగుతున్న తీరుపై డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్‌ను ఆరా తీశారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు



చౌడేశ్వరిదేవి సేవలో వీరాంజనేయ ప్రసాద్, శ్రీలత, తదితరులు



సత్యమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎండీసీ హరీష్‌రెడ్డి, భక్తులు

కలకడ : మండలం కేంద్రంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. దేశాయి కుటుంబ సభ్యులు అమ్మవారికి ఒడిబియ్యం కట్టి ఉత్సవాలను ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం తర్వాత అమ్మవారిని చాందినీబండిలోని సింహవాహనంపై ఊరేగించారు. అమ్మవారి రథం ఎదుట విశాఖపట్నం వారి కోళాటం నృత్యాలు, ప్రొద్దుటూరి వారి జ్యోతుల నృత్యాలు భక్తులను ఆకట్టుకన్నాయి. అమ్మవారి సేవలో తొగటవీరక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొదెం వీరాంజనేయప్రసాద్, మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలత , వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి విజయ్‌భాస్కర్, ఎంపీపీ శ్రీదేవి రవికుమార్, సింగిల్ విండోఅధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ విశ్వనాథ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా సత్యమ్మ తల్లి జాతర

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లిలో వెలసిన శ్రీ సత్యమ్మ తల్లి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు దీలు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి స్థానిక నాయకులతో కలసి సత్యమ్మ తల్లిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో అమరనాథరెడ్డి, శ్రీకర్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రమేష్ రెడ్డి, శీను, ఖాసీం సాబ్, మౌలాలి, సదామ్, మల్లికార్జున రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాలమ్మ గంగజాతర

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం నుంచి గంగజాతర నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ భాస్కర్ రెడ్డి తెలిపారు.